# స్వాధీన

[కథానిక]

శ్రీ వేలూరి సహజానందం

రైలు శరవేగంతో పరుగులెత్తుతోంది. చీకట్లో నిప్పురవ్వ లటూ ఇటూ భగ్గుభగ్గున, మిణుకు మిణుకుమంటూ పడుతున్నయ్—తోకచుక్కల్లాగా. పెట్టె సమ్మర్దంగా లేదు.

కిటికీవద్ద కూర్చొని అతను పరుగెత్తుతున్న కొండల కేసీ, చెట్లకేసీ చూస్తున్నాడు. చల్లని గాలి హాయిగా వీస్తోంది. పెట్టెలో అవతలవైపున ఓ యువకుడూ యువతీ చిరునవ్వులతో కులాసాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. వాళ్ల నవ్వులు పెద్దగా వినబడి, అటు చూసి, మళ్ళీ వెంటనే ఆకాశంవైపు ముఖం తిప్పుకున్నాడు.

పైస్టేషన్‌లో ఆ జంట దిగిపోయారు. ఎవరో ఒకళ్లిద్దరు కొత్తప్రయాణీకులు పెట్టెలోకి వచ్చారు. కదిలి, మళ్ళీ పరుగెడుతున్న రైలుచప్పుడులో అతనికా యువతీయువకుల నవ్వులు, మాటలు ప్రతిధ్వనిస్తున్నయ్. ముఖంపై విషాదం మబ్బులా కమ్మింది.

ఆకాశం చీకటి చెరువైంది. ఆ అనంతమైన చీకటి—దిగంచలాల్లో ఎక్కడో సుదూరంగా ఒక మెరుపు తళుక్కుమంది. తటిత్తున సాక్షాత్కరించిన మనోభీష్టం మళ్ళీ అంధకారంలో కలిసిపోయింది. దీర్ఘనిశ్వాస మొకటి అతనిలోంచి వెలువడి, ముఖాన్ని మరింత నిర్జీవం చేసింది.

రెండు స్టేషన్లు దాటాక ఒక చిన్న పల్లెటూరి స్టేషన్ వచ్చింది. హడావిడిగా తలుపు తెరచుకొని ఒక యువతి ప్రవేశించింది. పెట్టె, పక్కచుట్ట గబగబా లోపల పడేసి, కుర్రాడు తలుపు వేశాడు. ప్లాటుఫారంమీద నుంచొని ఒక ముసలాయన "వెళ్ళంగానే అతని కెలా ఉందీ ఉత్తరం వ్రాయండి... ఒరే అబ్బాయ్...జా..."అని ఇంకా ఏమోఅంటున్నాడు.

కదులుతున్న రైలుచప్పుడులో అతని మాటలు అస్పష్టమైనయ్...చీకట్లో ఆ వృద్ధుని ముఖం అదృశ్యమైంది.

ఆమె ముఖం క్రమేపీ విషాదంతో పాలిపోవటం కిటికీవద్ద కూర్చొన్న అతను చూశాడు. వెనకబడిపోయిన స్టేషన్‌వైపునుంచి ఆమె ఇంకా ముఖం తిప్పుకోలేదు. కాసేపయాక ఆమె మెల్లగా ప్రయాణీకులకేసి చూసింది. తైలం తగ్గుతున్న జ్యోతుల్లా వున్న ఆమె కళ్ళను చూసి, అతను మళ్లీ ఆకాశంవైపు తిరిగి, చెట్లకేసీ, దిబ్బలకేసీ చూస్తున్నాడు.

అతని కళ్ళలో రాధప్రతిమ అశ్రుపూజ నందుకుంటోంది. అతని హృద్వేగంలో రైలు స్థాణువులా ఉంది. గతదినాలన్నీ రైలుచక్రాలై, తనపై బరువుగా దొర్లుకపోతున్నయ్.

మరునాడు తాను దిగే వూరు రాధఉన్న ఊరే. నాలుగేళ్లయింది చూసి రాధను. మళ్ళీ ఇన్నాళ్లకు ఎక్కడెక్కడో తిరిగి, ఆమె ఉన్న చోటికే వస్తున్నాడు.

రైలులో ఎదురైన యువకదంపతుల్లాగా తానూ రాధతో కలిసి కేరింతలాడుతూ జీవితయాత్రచేసేవాడు.

కాని యాత్రికుల బాటలు చీలిపోయినయ్. దుఃఖార్తురాలైన ఎదుటి ప్రయాణీకురాలిలా తమ హృదయాలూ సుఖదుఃఖాల్లో సమంగా స్పందించేవి. కాని భగ్నమైంది తన హృదయం.

ఆ దంపతుల చిరునవ్వులు, మాటలు, సంతోషంతో, ఉల్లాసంతో మెరిసిన వారి ముఖాలు హఠాత్తుగా వ్యాధిగ్రస్తుడైన భర్తకోసం క్షోభపడుతున్న ఆ యువతి కళ్లూ కళ్లలో మెదలగానే, గాయపడిన పాదంపై ఎవరో కాలితో తొక్కినట్టయింది.

తెల్లవారేముందు అతనికి కొంచెం మగత పట్టింది. ప్రయాణీకుల సందడికి మెలకువ వచ్చింది. స్వాప్నిక భ్రాంతి తొలగగానే, చేతులు మళ్ళీ సంకెళ్లలో నొక్కుకున్నయ్.

పక్క స్టేషన్‌లో యువతీ, కుర్రాడూ దిగారు. రైలుదగ్గరకు ఎదురుగా వచ్చిన చుట్టాలు, "తగ్గిపోయింది...జ్వరం...ఆదుర్దా ఏమీ లేదన్నారు... డాక్టర్లు" అని చెప్పగానే, ఆమెముఖం తటిత్తున మెరిసింది. ఆకళ్లు ఆశాసంతోషాలతో నీళ్లునిండేయ్. అశ్రువుల్లో ఆశ సూర్యుని తొలికిరణాల్లా తళుక్కుమంది.

మళ్ళీ ఘీంకరిస్తూ రైలు కదిలిపోయింది. అతని మనస్సులో ఆశాజ్యోతి ఒక్కసారి భగ్గుమంది. దైవికంగా రాధ ఉన్న ఊర్లోనేగదా తన కుద్యోగమైంది. తమ మైత్రి, బాల్యస్మృతులు మళ్ళీ తమను ఏకంచేయగలవు. గతం శవమాత్రం కాజాలదు. అలా అయితే దాన్నెప్పుడో తాను దహనం చేయగలిగేవాడే. గతం జీవస్రవంతి. ఆ మహాప్రవాహ మిప్పుడు మరుభూముల్లో ఇంకిపోయినా, మళ్లీ దాని ఉత్తుంగతరంగాలే తనను, రాధను ఆనందసముద్రానికి చేరుస్తయ్. తాను రాధ నెలా మరచిపోగలడు? ఇది తన శక్తికి, కాంక్షకు మించినది. రాధ లేని తాను కన్నులేని కబోదిలా ఇన్నేళ్లూ తిరిగాడు.

స్టేషన్ సమీపిస్తోంది. దూరం దగ్గరవుతున్న కొద్దీ అతనిమనోవేగం అధికమవుతోంది. ఏ రహస్యనిశిరాత్రో తాను రాధహృదయద్వారంవద్ద నిలబడి తన ఏకైక ప్రార్థనను విన్పిస్తాడు.

తన జీవితంలో మళ్ళీ ఉషస్సు ఉదయిస్తుంది. లేదా... అతని గుండె జలదరించింది. మనస్సుయొక్క ఊహావిహంగాల విసురుకు లజ్జచెందాడు. భీతి కల్గింది. నైరాశ్యపు కారడవుల్లో చిక్కుకుపోయిన తాను మళ్లీ గగనకుసుమాలకై చేతులు చాస్తున్నాడు.

రాధ బాల్యపురాధ కాదు. ఇల్లాలు. తా నిదివరకు చెట్టుకొమ్మపై కూర్చోపెట్టి, కిందకు పడేశాడు. కోపంలో వెదురుబద్దతో కొట్టాడు. కాని ఇప్పుడు తన చేతిలోంచి దూసుకువెళ్ళి రాధకు తగిలే దెబ్బ వజ్రాఘాతమై, తా నొక పచ్చని కాపురానికి నిప్పంటించినవాడవుతాడు. ఆలోచనల తీవ్రకాఠిన్యతకు, ఉచ్చుతాళ్లలా ఉరితీసే ఫలితాలకు నిట్టూర్చి, సామానులు సర్దుకో నారంభించాడు.

౨

ఇన్నాళ్లకు ఇప్పుడు స్నేహితురాలిని చూసేసరికి అతని ముఖం ఒక్కసారిగా సంతోషంతో ప్రఫుల్లమైంది. జైలులోని ఖైదీ ఆప్తులను చూసి ఆనందపరవశమైనట్టు. రాధకని గదిలోంచి బయలుదేరినప్పుడు ఆందోళనాపిచారాలు అతని కాళ్లకు బంధాలైనయ్.

ఒకే ఊరివాడు, బాల్యమిత్రుడు అనుకోకుండా అగపడగానే రాధముఖం కలకలలాడింది.

"ఎప్పుడు వచ్చావు?" అని అడిగింది.

"ఇవ్వాళే...కీ ఊర్లో ఉద్యోగమైంది... నిన్నుచూసిపోదామని వచ్చాను."

"మేం గుర్తున్నామన్నమాట"

అతని మనస్సు క్షణమాత్రం చివుక్కుమంది. రాధను తాను మరచిఉండగలిగితే బాగానే ఉండేది. కాని అది తన కసాధ్యమైంది. రాధ తన హృదయస్పందం; తన ఊపిరి. తన మనఃపథమంతా రాధ పదచిహ్నాలతో పునీతమైంది.

"ఎక్కడ దిగావు?"

"హోటలులో దిగాను.... రెండురోజుల్లో ఎక్కడైనా గది చూసుకోవాలి."

"హోటలూ వద్దూ...గదీ వద్దు... మా ఇల్లు బాగా పెద్దది కాకపోయినా, సరిపోతుంది. సువ్వొక గదిలో ఉండవచ్చు... ఈ హోటలుభోజనాలు చేసే ఇన్నాళ్లూ ఇలా కూనారి అయావు." అని రాధ సంజ చీకట్లో ఎలెక్ట్రిక్ దీపం వేసింది.

ఈ నాలుగేళ్ల తర్వాత రాధ యౌవనంతో ఉజ్వలంగా ఉంది.వయస్సుతో సమ్మోహనంగా ఉన్న ఆమెరూపం అతని కళ్లను మిరుమిట్లుగొల్పింది. ఈ యౌవనం తా నెరుగడు. ఆ విశాలనేత్రాల్లోకి చూసి నప్పుడు, అతని హృదయం ఉప్పొంగింది. అవి తన చిరకాలమిత్రులు. కాని ఇప్పుడక్కడ బాల్యపు అమాయకం పోయి, సౌందర్యమే కన్నెత్తి చూస్తున్నట్టుంది. ఆహ్లాదంతో వివశు డయాడు.

"మీవారు ఊర్లో ఉన్నారా?"

"ఆ...ఆఫీసునుంచి వచ్చే వేళ అయింది. మరి నువ్వు సామాను తీసుకురావాలి. హోటలులో భోజనం పెట్టకు."

"బాగా ఉండదు"

"వారేమీ అనుకోరు...నిన్ను బొట్టూ కాటుకా పెట్టి ఆయనే పిలుస్తారులే...సరేనా?"

"ఏదో గది దొరికేదాకా మీఇంట్లో ఉంటాను. కాని, భోజనం—"

"నేనేం కొత్తదాన్నా—?" అని మెల్లగా రాధ అంది. అతను జవాబివ్వలేదు.

ఆమె కొత్తదా తనకు? కాదు...తన ప్రాణం. తనతో గంతులేసి, ఆటపాటలాడి, పెరిగి పెద్దదైంది. కాని, ఈరాధ... తన కపరిచిత! ఈ శరీరాన్ని తాను తాకలేదు. ఈ మనస్సుయొక్క ఆటుపోట్లు తా నెరుగడు.

"చిన్నతనంలో నా మాట ఎప్పుడూ వినేవాడివి కావు. ఇప్పుడుకూడా అలాగే." అని ఆగింది రాధ.

తన్ను మరచిపోలేదు రాధ. తనపై మక్కువ తగ్గలేదు.

రాధ ఊరికబుర్లేవేవో అడిగింది. తన ఉద్యోగ ప్రయత్నాలూ, ఇంటిగొడవలూ ఏకరువుపెట్టాడు.

"ఈ నాలుగేళ్ళూ నీకు కనబడకుండా తిరుగుతున్నా, నాకళ్ల కెప్పుడూ నువ్వు కనబడుతూనే ఉన్నావు— నక్షత్రంలా." అన్నా డతను.

అతని కళ్లలో హర్షం ప్రతిబింబించటం ఆమె చూసింది.

"ఏదో భావకవి వవుతున్నట్టున్నావు" అంది.

అతను లజ్జతో చూశాడు.

ఇంతలో భర్త వచ్చాడు. భార్యవైపు చుట్టాన్నిగుర్తించి, పలకరించాడు. రాధపెళ్లినాటి పరిచయం జ్ఞాపకంచేసుకొని ఉభయులూ మెల్లగా అవీ ఇవీ లోకాభిరామాయణం చెప్పుకున్నారు.

రాత్రి భోజనాలదగ్గర తన్ని తమ ఇంట్లో ఉండమని ఆహ్వానించాడు. రాధ నిర్వ్యాహకత్వం చూసి అతను ఆశ్చర్యపోయాడు.

## 3

ఇప్పుడతను వాళ్లింట్లోనే ఉంటున్నాడు.

రాత్రి ఆలస్యంగా వచ్చాడు. ప్రశ్నార్థకంగా చూసిన రాధతో "సినిమాకు వెళ్లాను...చాలా బాగా ఉంది." అని అన్నాడు.

అన్నం వడ్డిస్తూ రాధ అడిగింది.

"అంత బాగా ఉంటే నన్ను తీసుకు వెళ్లలేదేం?"

"నిన్నా?"

"ఏం"

"వస్తావో...రావో..."

"ఎందుకు రాను?"

"నాతో రావద్దూ—నే నిప్పుడు పరాయివాడనయ్యె."అని సంకోచం వెలిబుచ్చుతూ జవాబిచ్చాడు.

కాసేపుండి రాధ అంది:

"వారు మామూలుగా సినీమాలకు వెళ్లరు. నే వెళ్తానంటే వద్దనరు."

అతని ముఖంలో తటిత్తున మెరసిన భావా

లామె గ్రహించింది. పరాయివాడి నన్న అతని మాటలకు నొచ్చుకుంది.

"ఇక్కడ మనలో పరాయివా ళ్లెవరు— మోహన్! నువ్వు లేపో అలా మాట్లాడటం—" అని రాధ ఆగి, మళ్ళీ ఆరంభించింది:

"ఇన్నాళ్ళకు మళ్లీ కలుసుకోవటం సంభవించిందని నే నెంతో ఆనందంగా ఉన్నాను. మన చిన్నతనం—ఆ బడి—మిగతావాళ్ల పలకబలపాలు దాచి, పంతులుగారి దెబ్బలు తినటం . . గుళ్ళో పప్పు బెల్లాలకు ముందు తయారు కావటం, చెరువు మెట్లమీద మడివాళ్లను మైలపడేయటం...ఇప్పుడు నీకీ ఊరిలో ఉద్యోగమవటం, మా ఇంట్లో ఉండటం—నిజంగా నాకు పండగగా ఉంది. నీకు దండం పెట్టుతాను. నువ్వలా మాట్లాడకు."

వంటింట్లో హఠాత్తుగా అడుగుపెట్టిన భర్తను చూసి మోహన్ ముఖం వివర్ణమైంది. ఈ యువక బంధువుముఖవైఖరి శివరావు చూసి, "ఏమా రాధ ఏదో ఉపన్యాస మిచ్చేస్తోందే.. సినిమా ఎలా ఉంది?" అని, కాసేపుండి వెళ్లిపోయాడు.

రాధ తన బాల్యాన్ని గుర్తుతెస్తుంటే మోహన్ మనస్సు చలించింది. దాంపత్యపు అవరోధాన్ని దాటి స్నేహితురాలు తన ప్రక్కహృదయాన్ని తాకింది. ఏళ్ల తరబడి, ప్రచ్ఛన్నంగా, నిగ్రహనేపథ్యంలో అణగిమణగివుంటున్న మోహన్ స్వప్నాలన్నీ ఒక్కమ్మడిగా మానసికాకాశంలో ఇంద్రధనుస్సై మెరసినయ్. ఇంతలో శివరావు కనబడగానే అతని ఊహాపతంగం పుటుక్కున తెగినట్టయింది. అంతే కాదు. రాధమాటలు అతను విన్నాడేమో!... ఈ అనుమానం కలగగానే మోహన్ రాధవైపు చూశాడు.

భర్త మెల్లెక్కి డాబాపైకి వెళ్తున్న అడుగుల అలికిడి వినబడుతోంది.

"రాధా!" అన్నాడు మోహన్.

"నాకు తెలుసు...నీ ఆందోళన...కంగారు" అన్నట్టు చిరునవ్వు నవ్వింది రాధ. ఆ నిబ్బరం అతని కర్థం కాలేదు. మోహన్ ముఖంలో కనబడిన బెదురుచూసి, "నన్ను గదిలో పెట్టి తాళం వేసి, మా వాళ్లను పూరూ నాడూ తిప్పించినప్పుడూ..." అని అంది రాధ.

కొంతసేపయాక కంపితస్వరంతో మోహన్—

"రాధా...నన్ను మరచిపోయివుంటావనుకున్నాను...మన బాల్యం నీకాలికి తగిలిన గులకరాయిగా మటుకు గుర్తుందేమో ననుకున్నాను. కాని ఇప్పుడు నీతో మాట్లాడుతుంటే, మీ ఇంట్లో ఉంటుంటే..." అని అతను ఊరుకున్నాడు.

"అవును...అప్పుడు చిన్నపిల్లలం— అప్పుడు బొమ్మరిళ్లాటలు" అంది రాధ.

బాల్యమిత్రుని మాటలు తుమ్మెదలై ఆమె హృదయంలో ఝుంకారం చేసినయ్.

## ౪

అతని కారాత్రి నిద్రపట్టలేదు. ఎడారిలా ఇసుకపారిన మన స్సిప్పుడు మనోహరమైన ఉద్యానవనమై, వసంతపు కోకిలల కలకలారావములతో ప్రతిధ్వనిస్తోంది. నైరాశ్యపు సంకెలలు సువాసనా భరితమైన పూలమాల లైనయ్.

రాధ తనపై చూపిస్తున్న ఆదరాభిమానాలు, మక్కువ, చనువు ఆమె నేపథ్యానికి తెరలెత్తుతున్నయ్యా? ఆమెహృదయమందిరంలో తన విగ్రహం విచ్ఛిన్నమై శిథిలం కాలేదూ? ఆమె ప్రతీమాటా, ముఖభంగిమా ఆ విగ్రహంముందు దీపారాధనగా ఉంది తనకు.

నిశిరాత్రి దాటింది. డాబామీద దంపతులు పరున్నారు. కాని మోహన్‌కు నిద్రపట్టటంలేదు. కిటికీలోంచి చీకటిలోకి చూస్తున్నాడు. ఏదో అలికిడి... రాధ...? అతను మెల్లగా వెనక్కు తిరిగి ద్వారంవైపు చూశాడు. నిశ్శబ్దంగా ఉంది. అలికిడి ఏదో...భ్రమ. అతని మనస్సు వ్యాకులితమైంది.

రాధపెళ్లిలో తానూ ఊరేగింపుల్లో, పెళ్లి పందిరికిందా, చుట్టపక్కాలతోనూ సంతోషంగా తిరిగాడు. అప్పటికి తనకు పధ్నాలుగు పదిహేనేళ్లు. మధ్యమధ్య ఏదో అసంతృప్తి...అర్థంకాని నిర్లిప్తత.

మళ్ళీ బాజాబజంత్రీలు... సరసపల్లాపాలు ఊరేగింపులు.. సరదాగా గడచిపోయింది.

కాని క్రమేపీ రోజులు గడచినకొద్దీ బాల్య స్మృతి స్మృతిమాత్రంగానే నిలిచిపోలేదు. వయస్సుతోపాటు మైత్రీస్మరణ వృద్ధిచెందింది. బాల్యంలో సిద్ధించిన బంధం తెగిపోదనీ- తెగిపోలేదనీ తెలుసుకున్నాడు. ఆ బంధం పాణిబంధం కాకపోయినా, తనకు ప్రాణబంధమైంది. హృదయం స్నేహితురాలి స్మృతితో స్పందించింది. అహర్నిశాలూ అంతరాత్మ విధియొక్క మహాయాగానికి యజ్ఞపశువై వ్యథితమైంది.

రాధ తనది కాకుండాపోయినప్పుడు, తన హృదయం ఘోషించిందేమో. కాని తనకు తెలియదు. అప్పటి బాల్యానుభవాలు, స్వప్నాలు తన నెప్పటికీ నీడలై వేటాడి వెంటాడుతాయని తెలియదు.

పరాయిదైన రాధ ఎప్పటికీ తనకు పరాయిదే. తనకూ రాధకూ మధ్య అడ్డుగా నిలిచిన భర్తను చూసి ద్వేషం కలిగింది. ఈ అపరిచితుడు, అజ్ఞాతవ్యక్తి రాధకు సర్వాధికారి! రాధహృదయసామ్రాజ్యానికి సామ్రాట్టు!! ఇప్పుడు రాధఆనందం, తృప్తీ, ఉల్లాసం అన్నిటికీ అతనే తేనెపట్టు!

తాను! చిరపరిచితుడు... చిన్ననాటి చెలికాడు... రాధహృదయసామ్రాజ్యంలో తీరని కోరికల చినుగుజోలెతో నిలబడిన బికారి!

ఒకప్పుడు సర్వస్వం తనదే. కాని ఈనాడు తనకు శూన్యం!

ఓడిపోతున్న గుర్రంలా నిష్ఫలమనో వేగంతో మరింత నిస్పృహచెందింది, కృశించాడు.

అత్తింటినుంచి పుట్టింటికి పండగలకు, పబ్బాలకు రాధ వచ్చినప్పుడు, తాను పలకరించి, కబుర్లు చెప్పేవాడు.

కాని రాధ ఇంకా అమాయకురాలు... కన్య శరీరంలో బాలమనస్సు. తనను దహిస్తున్న దుఃఖాగ్ని ఆమెకు సోకలేదు. పైగా మొగుడిగురించి, అత్తవారి వైపువాళ్ల గురించి ఎంతో అభిమానం!

తన అంతర్వేదన గురించి ఒకసారి చెప్పాలనుకున్నాడు. కంఠంలోంచి మాట వెలువడలేదు. గడచిన రేయి మళ్లీ రాదు. స్నేహితురాలి అమాయకసంతోష సముద్రంలో తన భగ్నహృదయానికి తెరచాప నెత్తలేకపోయాడు. చక్కని ఉద్యానవనంలా ఉన్న రాధ మనస్సులో తన అంతర్గతదుఃఖం బోనులోంచి బైటపడిన బెబ్బులిలా హాహాకారాలు చేస్తుంది.

ఇలా అంతర్వేదనతో కృశిస్తుండగా, అనుకోకుండా ఇదేవూరిలో ఉద్యోగమవటం, రాధ తన్ను బాల్యంలోవలె ఆత్మీయునిగా ఎంచటం అతనికి ఆశ్చర్యంగా, మహదానందంగా ఉంది.

గడియారం నాలుగు కొట్టింది. ఇంకా నిద్ర రావటంలేదు. ఆకాశంలో నల్లని మబ్బులు కదిలిపోతున్నట్టు, అతని మనస్సులో మసకమసకగా ఆలోచనలు చెలరేగుతున్నయ్.

## ౫

మరునాడు రాధ అడిగింది:

"మరి పెళ్లి ఎప్పుడు మోహన్?"

"ఎప్పుడో... అప్పుడు."

"ఏం పాపం...ఇంకా పన్నెండేళ్ళ బాలకుమారుడివేనా?"

"అంతా రాధలాగానే ఉండరు. నే నేం బాలకుమారుడి నని అనలేదే?"

"చాలులే" అంది రాధ.

భర్తవైపుసంబంధం ఏదో ఉందనీ, పిల్ల బాగా ఉంటుందనీ చెప్పింది. కాని అతను మనస్సుకు పట్టించుకోవటంలేదు.

కొంచెం సేపయాక అన్నాడు మోహన్:

"నీపెళ్లి అప్పుడే నాకూ మావాళ్లు ఎందుకు పెళ్లి చెయ్యలేదో."

అతని స్వరంలో ఉద్రేకం, విరక్తి వ్యక్తమవుతున్నయ్. అతని ముఖం వివర్ణంకావటం చూసింది రాధ.

"చేస్తే?" అని అంది.

"చేస్తే? ఏముంది! హాయిగా ఉండేది." అని అతనింకా ఏమీ మాట్లాడకుండా అక్కడనుంచి లేచిపోయాడు. అతని ముఖం, మాట, ప్రవర్తన హఠాత్తుగా మారిపోవటం చూసి ఆమె విస్తుపోయింది.

అతనికీ అప్పుడే పెళ్ళిఅయితే? మిత్రుని మాటలు ప్రతిధ్వనించి, ఆమెకళ్లు కలవరపడినయ్.

ఆమెకు ఒక్కసారిగా మళ్లీ తమ బాల్యపు రోజులు గుర్తువచ్చినయ్. చిన్ననాటి చెలికాని కళ్లలో దైన్యం ఆమెహృదయాన్ని కలచివేసింది. మోహన్ బొమ్మలపెళ్లిళ్లు మరచిపోలేదు అనుకొంది.

## ౬

సాయంకాలం మోహన్ ఇంకా ఇంటికి రాలేదు. చీకటిపడ్డది. ఏమీ తోచక, శివరావు మోహన్ గదిలోకి వెళ్లాడు—ఏదైనా పుస్తకం తెచ్చు

కుంటామని. గోడఅలమరలోంచి ఒకటిరెండుపుస్తకాలు తీశాడు. అవి అతనికి నచ్చలేదు. ఇంకేదో పుస్తకంతీసి, పేజీలు తిరగేశాడు. కాలిమీద ఏదో జారిపడ్డట్టు అయింది. అతను కాలు విదిలించాడు—ఏదైనా చినిగినకాగితంముక్కేమో అని. దీపంవెల్తురులో ఫోటో ఒకటి తళుక్కుమంది. వంగి, ఆ చిన్న ఫోటోను పైకెత్తాడు. తక్కున అతని రెండుకళ్లూ బొమ్మపై పడ్డయ్.

పదిపన్నెండేళ్ల బాలిక......తెప్పించుకోలేని నవ్వు...విశాలనేత్రాలు...అతని మనస్సు కళవళపడ్డది. ద్వారంముందునుంచి రాధ వెళ్తోంది. "రాధా" అని పిలిచాడు. గుమ్మందగ్గర ఆగి, "ఏమిటి పుస్తకాలేవో చూస్తున్నారు ? మోహన్ సినిమాకు వెళ్లాడేమో ?" అంది రాధ.

"ఏంలేదు...సరేలే" అన్నాడు. అత నింక ఎక్కువ మాట్లాడలేకపోయాడు. కాని ఆపాదమస్తకం కంపించాడు. ఆఫోటో మళ్లీ పుస్తకంలో పెట్టాడు.

ఇంటికప్పులో నల్లతాచొకటి చరచర పాకిపోతున్నట్టు తోచింది అతనికి.

సినిమాకు వెళ్లివచ్చిన మోహన్‌కు అన్నంపెట్టి, సినిమాకబుర్లు అడుగుతోంది రాధ. ఉభయుల మాటలూ డాబాపై పరున్న శివరావుకు మోహన్‌గదిలోంచి వినబడుతున్నయ్.

ఆరాత్రి డాబామీదకు భార్య వచ్చాక, కొంతసేపటికి శివరావు మెల్లగా అన్నాడు:

"అత నెక్కడైనా గది చూసుకుంటున్నాడా?"

రాధ చకితురాలైంది. భర్త ఇలా అడుగుతాడని ఆమె ఎప్పుడూ ఊహించలేదు.

"మనింట్లో ఉంటున్నాడుగా ?" అంది.

"ఎన్నాళ్లుంటాడు...పరాయిఇంట్లో !"

రాధ ఇక మాట్లాడలేదు.

భర్తమాటల్లో దూరంగా పిడుగులమోత వినబడ్డది. తనముందు నక్షత్రాలతో, చంద్రబింబంతో మనోహరంగా ఉన్న ఆకాశంలో తుపానుల మదపుటేనుగులు చొరబడి భీషణంగా ఘీంకరిస్తున్నయ్. ఆమెగుండె దడదడ కొట్టుకుంది. తన బాల్యమిత్రుడు తన దాంపత్యానికి......?

భర్తకళ్లల్లోంచి క్షణమాత్రంగా దూసుకువచ్చిన చూపు నోటి కందిచ్చిన విషంలా ఉంది రాధకు.

ఆరాత్రంతా సంక్షోభంతోనే మేల్కొనిఉంది. భర్తకు తన అశ్రుపూరితనయనాలను చూపించాలనీ, అతని కళ్లలోనలుసును తీసేయాలనీ అనుకుంది. కాని ఆమెకు ధైర్యోత్సాహాలు నశించినయ్. సుఖంగా గడచిపోతున్న రోజు లొక్కసారి రథచక్రాలై గుండెలో కూరుకుపోతున్నట్టుంది.

నిర్మలంగా వెలుగుతున్న దీపం హఠాత్తుగా గాలివిసురుకు అల్లల్లాడింది. వీచింది పిల్లగాలే అయినా, పెనుగాలి హోరురొద ఆమెఎడదలో ప్రతిధ్వనించి, దీపం మిణుకుమిణుకు మనసాగింది.

మరునాటి పొద్దున రాధతో మోహన్ ఏదో మాట్లాడుతుండగా, భర్త ఆదారే వెళ్లాడు. రాధగుండె చివుక్కుమంది.

ఆరాత్రి రాధముఖంలో మార్పు చూసి శివరావు అడిగాడు—"అలా ఉన్నావేం ?" అని.

"ఏం లేదు...వంట్లో బాగా లేదు." అంది.

భర్త మామూలుగానే మాట్లాడాడు. ముఖంలో కూడా మార్పేమీ లేదు. కాని రాధకు రాత్రిప్రసంగంలో వినబడిన పెనుగాలి ఇంకా మనస్సులో హోరుమంటూనే ఉంది.

## ౭

మోహన్ సాయంకాలం షికారుకు పోతుండగా రాధ ఆపింది. స్నేహితురాలి ముఖం నిర్జీవంగా ఉంది. అత నేవో అవీఇవీ కబుర్లు చెప్పుతున్నాడు. మధ్య మధ్య రాధ "మరి..." అని ఆగిపోయేది.

"ఏం రాధా ? అలా ఉన్నావు ? ముఖం అంతా..."

స్నేహితుని ప్రశ్న నంతటితో ఆపి, "ఏమీ లేదు..." అన్నది.

తన్ను షికారుకు వెళ్లనీయకుండా, అలా నిర్జీవప్రతిమలా ఎందుకు కూర్చొనివుందో అతని కర్థంకాక, "ఇంటిదగ్గరనుంచి ఏమైనా ఉత్తరం వచ్చిందా? అంతా కులాసా ?"అని అడిగాడు.

"ఎబ్బే...ఏం లేదు." అంది.

"నీముఖం ఎప్పుడైనా ఇలా ఉందా ?"

"నువ్వు కవివని ఇదివరకే చెప్పాగా..."

"ఏదో మాట్లాడబోయి ఆగావు ?" అన్నాడు.

ఆమె జవాబు చెప్పలేదు. తన పెదవుల్లోంచి భర్తఆదేశం వినబడగానే అత నేమనుకుంటాడు ? వెనకనుంచి ఎవ్వరో కత్తితో పొడిచినట్టయి, దైన్యంతో ఘూర్ణిల్లుతాడు. ఆమెపెదవులు కదిలినయ్. కాని మాటలు వెలువడలేదు. తన్ను వంచకురాలుగా ఎంచి, క్షోభపడడూ ?

అతన్ని దహించివేసే పరాభవాగ్ని, ముందు తన చుట్టూ కారుచిచ్చులా జ్వాలాచక్రమై ప్రజ్వలిస్తోంది.

అసలు తా నతన్ని ఇంటిలో ఉండమని ఎందు కంది ?

రెండురోజులయాక శివరావు అవీఇవీ మాట్లాడి, "అతనికి గది కుదిరిందా ?" అని అడిగాడు.

"ఇంకా నేను చెప్పందే" అంది రాధ.

"చెప్పు మరి...ఇప్పటినుంచీ ప్రయత్నిస్తేగాని దొరకదు."

౫

మర్నాడు శివరావును కంపెనీపెద్దఆఫీసుకు రమ్మని ఉత్తరం వచ్చింది. అత నారాత్రే బయల్దేరి వెళ్తూ భార్య నడిగాడు:

"వంట్లో బాగుండకపోతే డాక్టరుకు చూపించుకో" అని.

"ఏమక్కర్లేదు...మీరు వెంటనే వచ్చేయండి.. పట్నంగదా అని అక్కడ పదిరోజు లుండక."

భర్త వెళ్లిపోయాడు.

౬

గదికిటికీలోంచి చంద్రకిరణాలు పడుతున్నయ్. మోహన్ డ్రాయరుమీద అద్దం పక్కకు తీశాడు. సూటిగా చంద్రకిరణాలు పడుతున్న ఫోటో అతని ఆపాదమస్తకాన్ని హర్షంతో, ఉద్రేకంతో నింపింది. ఛాయను చూసి పరవశుడయాడు. సజీవప్రాణే ఇక్కడ ఉంది.

రాత్రి పడుకోటానికి డాబాపైకి పోతూ, గదిలో ఇంకా కూర్చొనివున్న మిత్రుడిని చూసి, "ఏమిటి ఆలోచిస్తున్నావ్ ?" అంది రాధ.

"ఏమీ లేదు" అంటూ అద్దాన్ని ఫోటో కెదురుగా పెట్టి, స్విచ్ వేసి, మోహన్ మెల్లగా డాబాపైకి వెళ్లాడు.

తమ వూరు, తమ బాల్యంగురించి కబుర్లు చెప్పుకుంటున్నారు. రాధ తనముందు కూర్చొని ఇలా స్మృతిమాధుర్యంతో హృదయాన్ని నింపుతుంటే, అత నుల్లాసంతో ఉప్పొంగిపోయాడు.

మధ్యమధ్య రాధ ఏదో చెప్పాలన్నట్టు ఆమె కళ్లల్లో గోచరించేది. పెదవులు మెదిలేవి.

అత నడిగాడు :

"ఏం రాధా ? ఏదో మాట్లాడాలనుకొని, మళ్లీ మూగగా ఉంటున్నావు ?"

ఆమె ఏం జవా బివ్వలేదు.

"నే నేమైనా నీ మనస్సుకు నొప్పి కలిగించానా ? నేనేమన్నా అన్నానా ?"

ఆమెహృదయం స్పందించింది.

"ఛా...నువ్వు నన్ను అనటమేమిటి ?"

రాధమనస్సు దుఃఖంతో దుర్బలమైంది. ఈ పండువెన్నెల్లో, చల్లనిగాలిలో, బాల్యదినాల మధుర స్మృతులమధ్య భర్తఆదేశం తాను విన్పించలేక పోయింది. అవమానాభిమానాలు ఆమెకర్తవ్యాని కడ్డు తగులుతున్నయ్.

మనస్సును కుదుటపరచుకొని, కాసేపయాక సంతోషంతో ఆమె కబుర్లుచెప్పుతోంది. చంద్రుని మీదనుంచి చిన్న మబ్బు ఒకటి కదిలిపోగా, అతని ముఖం వికలంకావటం ఆమె చూడలేదు.

అత నేదో కథ చెప్పుతున్నాడు. రాధకళ్లు నిద్రతో బరువెక్కటం చూసి, "ఇక పడుకో" అని చెప్పి, మెట్లు దిగి వెళ్లిపోయాడు.

గదిలో ప్రవేశించాడు. చీకట్లో చంద్రకిరణాల అస్పష్టకాంతి స్నేహితురాలిపై పడుతోంది. అతని వేళ్లకు తగిలి, ఫోటో కిందపడ్డది. వంగి ఆ ఫోటోను పైకెత్తగానే అతనిగుండె జలదరించింది. యౌవనంలో ఉన్న రాధను చీకట్లో స్పృశించి చకితుడైనట్టుంది. డ్రాయరుమీద ఎదురుగుండా ఫోటోను పెట్టాడు. బాలరాధయొక్క విశాలనేత్రాల్లో రాధయౌవనం స్ఫురించి, అతని హృదయంలో ఝంఝామారుతం వీచింది. ఎన్ని నాళ్లు...ఎన్ని ఏళ్లు తన కీ రేయి జాగరణ...

నిద్రాణమైన నిశీథంలో అతను జాగృతుడై ఉన్నాడు. అంతరాత్మయొక్క ప్రార్థనామందిరంలో కోరికలన్నీ జేగంటలై మోగి, మారుమోగుతున్నయ్.

అతనికి నిద్రపట్టలేదు.

తా నీవూరు వస్తున్నప్పుడు అనుకున్నాడు. ఏ రహస్యనిశిరాత్రో రాధహృదయద్వారంవద్ద నిలబడి తన ఏకైకప్రార్థన విన్పించాలని.

రాధకు, తనకు మధ్య ఈఇల్లు, మెట్లు యజమాని దుర్విధి లేవనెత్తిన కోటగోడలు. దుర్విధియొక్క ప్రసన్నతకై ఎంతకాల మీప్రతీక్ష ? అతని హృదయంలో ఉద్రేకపారవశ్యాలు జలప్రవాహములమధ్య మేడమిద్దెలను మట్టంచేసే తుఫానుహోరుతో ఉద్ధృతమైన సముద్రతరంగాలవలె ఘోష చేస్తున్నయ్.

గదితలుపులు దగ్గరకు వేసి, మెల్లగా మెట్లెక్కి డాబాపైకి వెళ్లాడు. హృద్వేగంతో కంపిస్తూ, డాబాపై నుంచున్నాడు.

ఆకాశం చంద్రకాంతితో తెల్లని పాలసముద్రంలా ఉంది. కోటానుకోట్ల నక్షత్రాలు వెన్నెల పువ్వుల్లా ఉన్నయ్. కిందనుంచి పూల సువాసన చల్లగాలిలో వ్యాపిస్తోంది.

అతని హృదయం ఆందోళనతో, ఆవేశంతో తడబడుతోంది.

విభావరి వేసిన వెన్నెలపందిరికింద, దేవతల నానాశీర్వాదాలమధ్య భగ్నహృదయుడైన ప్రేమికుడు ఉల్లాసంతో, వాంఛామధువుతో పరవశుడై ఉన్మత్తుడయాడు.

చల్లని పిల్లగాలులకు రాధముంగురులు నుదుటిపై అటూఇటూ కదులుతున్నయ్. గాఢనిద్రలో వుంది రాధ. చంద్రబింబానికి ప్రతిబింబంగా వుంది ఆమెముఖం. నల్లని మబ్బులా జుట్టు దిండుపై వ్యాపించింది.

మనస్సు నద్రిక్తపరుస్తున్న రహస్యనిశిరాత్రిలో, బాల్యస్నేహితురాలి సాన్నిధ్యంలో, భూమ్యాకాశాలు అతనికి పాదాక్రాంతమైనట్టుంది. ఇన్నేళ్లు నరకయాతనతో అంధకారంయొక్క అంచున నిలబడి ప్రతీక్షిస్తున్న తన నేత్రాంచలాలు ఉషస్సుతో వెలుగునిండి, హర్షపూరితమైనయ్.

చంద్రబింబంపై పెద్దమబ్బు అడ్డువచ్చింది. రాధ ముఖంపై చీకటినీడ పడ్డది.

తన కంపితహస్తం రాధముఖాన్ని తాకగానే, మోహన్ గుండె జలదరించింది. తన చేతులు ఆమెచేతులకు తగలగానే నరాల్లో తోకతొక్కిన తాచుపాములు పడగలెత్తి, బుసకొట్టినై. అత్యంతావేశం, కళ్లెం తెగి, పరవళ్లు తొక్కుతున్న పందెపుగుర్రంలా ఉంది. అతని కళ్లలో చీకటి చుట్టలు చుట్టుకుంటున్నట్టుంది.

హఠాత్తుగా ఉలిక్కిపడి లేచింది రాధ. మోహన్ తన జుట్టును ముఖంమీంచి పక్కకు తీస్తున్నాడు. అతని ముఖం పండువెన్నెల్లో కారుమబ్బులా ఉంది. ఆ కళ్లు మోహన్ కళ్లు కావు... తోడేలుకళ్లు...అతను కళ్లెత్తి తనకేసి చూడగా, వాటిలోంచి మెరుపులు నిప్పుతీగలై మెరిసినట్టయింది.

హంతకు డాకళ్లలో నల్లని ముసుగేసుకొని, తనయెదుట నిలబడ్డట్టుంది.

"మో...హన్...?" అనిమటుకు తడబడుతూ ఉద్రేకంతో అంది.

గులాబిపువ్వును తుంపబోగా, ముల్లు గుండెకు గుచ్చుకొని, నెత్తురు చిందినట్టయింది అతనికి. తల వాలింది.

భయభ్రాంతులతో కళవళపడుతున్నయ్ రాధ కళ్లు. తలెత్తి స్నేహితురాలిని చూశాడు. భీతితో ఆమె ముఖం పోలికలేకుండా పోయింది. చిన్ననాటి చెలికాడైన తన్ను చూసి, విషపుపురుగును చూసినట్టు కంపిస్తోంది. అతని హృదయం దహించుకుపోయింది. తన స్పర్శ నెచ్చెలికి వజ్రాఘాతమైంది. ఝుంఝూమారుతంలో రెపరెపలాడుతున్న దీపంలా ఉంది రాధ.

అశ్రుపూరితమైన రాధనేత్రాలు చూడగానే అతనికి స్వాస్థ్యం తప్పింది. గొంతుక ఏదో సవరించుకున్నాడు. కాని మాట పెగలలేదు. తొట్రుపడి చాపచట్టున కూలబోయి, ఎలాగో తెప్పరిల్లుకొని, వాలిన తలతో మెట్లు దిగుతున్నాడు.

నేలలో పాతుకుపోయిన రాధకు 'ఢా'మ్మని శబ్దం వినిపించింది. బరువుగా, ఏనుగుపాదాల్లా అడుగులు వేసుకుంటూ పిట్టగోడ కానుకొని చూసింది.

కింద చీకటిలోంచి మెల్లగా మెట్లపైనుంచి లేచి, గోడకు కొట్టుకొని మోహన్ తాగినవానిలా ఇంట్లోకి వెళ్తున్నాడు.

రాధకు జ్వాలలమధ్య నుంచున్నట్టుంది.

తలుపుల చప్పుడయింది... రోడ్డుమీద ఒక నల్లని నీడై కదిలిపోతున్నాడు బాల్యమిత్రుడు. రాధ కంఠం దుఃఖావేశాలతో బిగుసుకుపోయింది. ఏదో నాటకంలో భయంకరఘట్టంమధ్య హఠాత్తుగా తెరలు దింపినట్టుంది. ఎవ్వడో గూనివాడు, భయంకరవికారాకారంతో ఆ కారుచీకట్లో మబ్బులా కదిలిపోతున్నట్టు తోచింది రాధకు. తూలుతూ మంచంలో కూలబడ్డది. భర్త తలపుకురాగానే, మరణశయ్యమీద ఉన్నట్టుంది.

## ౧౦

ఊరినుంచి వచ్చి భర్త అడిగాడు—

"గది దొరికిందా అతనికి?"

రాధ వినబడనట్టు ఊరుకుంది.

"కొత్తగదిలో ప్రవేశించాడా?" అని మళ్లీ అడిగాడు.

"ఉద్యోగానికి రాజీనామా నిచ్చాట్ట." అంది రాధ.

"అదేమిటి? మళ్లీ ఈరోజుల్లో ఉద్యోగం?"

కాసేపు మౌనంగా ఉండి రాధ అంది—

"మన ఊరినుంచికూడా వెళ్లిపోయాడు."

అతని గుండె చివుక్కుమంది.